

పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణులు, అర్చకులు

## ముహూర్తాల నిర్ణయంలో పంచాంగం ప్రముఖం

- పంచాంగం ఆవిష్కరణలో డీడీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

రామగిరి, జనవరి 22 : సమాజంలో ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో కాలాన్ని నిర్ణయించడంతోపాటు పలు కార్యక్రమాలను ముందే నిర్ణయించుకోవడంలో పంచాంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని దూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవశర్మ అన్నారు. పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో తెలంగాణ దేవాలయ మతైక అర్చక, డీడీఎస్ఎస్, వైదిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీక్రోది నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మతైక అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్తి సత్యనారాయణ శర్మ, బ్రాహ్మణ పెద్దలతో కలిసి పంచాంగాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుభ, అశుభ కార్యక్రమం చేయాలన్నా దిక్సూచిలాంటిది పంచాగం అని, అందుకే ప్రతిఒక్కరూ వాటిని చదువాలి, వినాలి, ఆచరణ చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

పంచాగం ఆవిష్కరణలో చిన్నారులు చేసిన సాంస్కృతిక, సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి.

కార్యక్రమంలో తెలంగాణ మతైక సంఘం కోర్ కమిటీ చైర్మన్, చెర్వుగట్టు దేవస్థానం ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, డీడీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ శర్మ, అర్చక సంఘాల నేతలు, అర్చకులు పాల్గొన్నారు.

## పదోన్నతులకు టెట్ నిబంధన తొలగించాలి

- బంజారా ఉద్యోగుల సంఘం

మిర్యాలగూడ, మార్చి 29 : ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలనే నిబంధనను తొలగించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ కోరారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతల అనంతరం డీఎస్సీ రాసి మెరిట్ వచ్చిన వారినే ఉపాధ్యాయులుగా నియమించారన్నారు. మరోవైపు ఉపాధ్యాయులు పదోన్నతి పొందడానికి జీఓ టెస్ట్, ఈఓ టెస్ట్‌లు ఉన్నాయని, వాటి ఆధారంగానే పదోన్నతులు ఇస్తున్నారని మధ్యలో టెట్ పరీక్ష పాస్ కావాలనే నిబంధనతో ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి టెట్ పరీక్షతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎప్పుడో 25 ఏండ్ల క్రితం ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రస్తుతం టెట్ పరీక్షలో అర్హత సాధించడం అసాధ్యమన్నారు. కొత్త నిబంధనల పేరుతో ఉపాధ్యాయులకు పదోన్నతులు రాకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ సమగ్ర చర్చలు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని, తద్వారా ఉపాధ్యాయ పదోన్నతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బంజారా ఉద్యోగులు మక్లానాయక్, శ్రీనునాయక్, లాలూనాయక్, దేవి, కోట్యానాయక్, సైదా, జమ్లా పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు తలెత్తొద్దు

- తాసీల్దార్ జమీరుద్దీన్



నకిరేకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ జమీరుద్దీన్

నకిరేకల్, మార్చి 29 : ధాన్యం కొనుగోలు కేంద్రంలో సీరియల్ పాటించకున్నా, కాంటాల్లో అవకతవలున్నా, లోడింగ్, అన్‌లోడింగ్ సమస్యలున్నా నేరుగా తనను సంప్రదిస్తే బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ ఎస్‌కే జమీరుద్దీన్ రైతులకు హామీనిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చీమలగడ్డ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 17 శాతంలోపు తేమ ఉండేలా ధాన్యం ఆరబెట్టుకుని సెంటర్‌కు తీసుకు రావాలని రైతులకు సూచించారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని పీఏసీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేశ్, సీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జీలు శీలం నాగరాజు, ఎడవెల్లి సైదులు, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో తాగునీటి సౌకర్యం



నకిరేకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు వద్ద నీళ్లు పట్టుకుంటున్న రైతులు

నకిరేకల్, మార్చి 29 : కొనుగోలు కేంద్రంలో వసతులపై 'కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్' అనే శీర్షికతో గురువారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు పీఏసీఎస్ అధికారులు స్పందించారు. తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చీమలగడ్డ ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం తాగునీటి ట్యాంకును, రైతులు సేద తీరేందుకు టెంట్, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్రంలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★7th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్
విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4 లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్రచందనం & 40 రకాల పండ్లమొక్కలతో 10 గుంటల ప్లాట్లు కలవు. గజం: 2,199/- మాత్రమే. సంప్ర: 9346363436.
NT-327974

FLAT FOR SALE
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

# కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు ఖాయం

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు



మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి, విజయసింహారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 29 : లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయానికి రాగా.. ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని, కృష్ణారెడ్డి గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బోనగిరి దేవేందర్, పీసీకే ప్రసాద్ పాల్గొన్నారు.

### సీతారామాంజనేయ ఆలయంలో కంచర్ల సోదరుల పూజలు

తిప్పర్తి : మండలంలోని సిలార్‌మియాగూడెంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ యర్రమాద నరేందర్‌రెడ్డి, కవిత సన్మానించారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలూనాయక్

## దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే బాలూనాయక్

మాల్, మార్చి 29 : దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. చింతపల్లి మండలంలోని తీదేడు (వెంకటంపేట)లో జరుగుతున్న భవానీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగభూషణం, నాయకులు జితేందర్‌రెడ్డి, హరినాయక్, శ్రీనివాస్‌యాదవ్, నర్సింహ, సిరాజ్‌ఖాన్, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడ టౌన్, మార్చి 29 : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి 12గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు 9959226308 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

- టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు



మాట్లాడుతున్న టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు

మిర్యాలగూడ టౌన్, మార్చి 29 : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏను ప్రకటించాలని, సరెండర్, మెడికల్, జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్ పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్, స్కావెంజర్స్‌ను ఇవ్వాలని, పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసేలా తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల గ్రాంట్ రేషియోను రెట్టింపు చేసి ఒకేసారి ఆ మొత్తాన్ని స్కూల్ అకౌంట్‌లో వేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం కోసం ఒక్కో విద్యార్థికి 15 రూపాయలు చేసి, సిబ్బందికి హానరోరియం పెంచాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

## కరుణామయుడి స్మరణలో..

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



నల్లగొండలో మేరీమాత చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువ మోసే దృశ్యాన్ని నాటక రూపంలో ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

రామగిరి, మార్చి 29 : ఏసుక్రీస్తుకు శిలువ వేయబడిన రోజైన గుడ్ ఫ్రైడే వేడుకలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో కరుణామయుడిని స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు ప్రభువు చూపిన ప్రేమ, శాంతి, కరుణ ప్రజలందరిలో జీవించాలని, ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని ప్రార్థించారు. దేవరకొండ రోడ్డులో గల మరియరాణి గుట్టపైన చర్చిలో ఏసుక్రీస్తుకు శిలువ వేసిన సన్నివేశాన్ని నాటక రూపంలో కళ్లకు కట్టినట్లు చూపించారు. మరియు కెథడ్రిల్ చర్చి నుంచి మరియ కొండపై గల చర్చి వరకు సాగిన శిలువ ప్రదర్శనకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆనాడు మానవుల కోసం క్రీస్తు పడిన బాధలు, శిలువ సన్నివేశాన్ని చూసిన పలువురు కంటతడి పెట్టారు. గడియారం సెంటర్‌లోని సీఎస్ఎస్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే గురించి ఫాదర్స్ వివరించారు. ప్రభువు శిలువపై పలికిన 7వాక్కులను ప్రసంగించారు.

### మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని దుబ్బ తండాలో గల హౌజ్ ఆఫ్ ప్రేయర్ విశ్వాస పరిచర్య ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ హన్యానాయక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. గుడ్‌ఫ్రైడే ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగియనున్నట్లు ఆయన తెలిపారు.



మిర్యాలగూడ టౌన్ : హౌస్ ఆఫ్ ప్రేయర్ ప్రార్థన మందిరంలో శిలువను మోస్తూ ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ హన్యానాయక్



నల్లగొండలో మేరీమాత చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువ మోసే నాటక రూపాన్ని తిలకిస్తున్న క్రైస్తవులు



మధుర గీతి ఖండకావ్యం ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త జలంధర్‌రెడ్డి, కవులు, రచయితలు

## పద్యం అజరామరం

- సాహితీవేత్త గంట జలంధర్‌రెడ్డి

రామగిరి, మార్చి 29: పద్యం తెలుగు వారి సొత్తు అని, అయితే తెలుగు భాష ఉన్నంతకాలం పద్యం విలసిల్లుతుందని ప్రముఖ సాహితీవేత్త గంట జలంధర్‌రెడ్డి అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలోని చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కోమటి మధుసూదన్ రచించిన మధుర గీతి ఖండకావ్యం ఆవిష్కరణ సభ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇతర కవులు, రచయితలతో కలిసి మాట్లాడారు. గత నాలుగు దశాబ్దాలుగా కోమటి మధుసూదన్ పద్య రచనలో రాయడం అభినందనీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త, జాతీయ సినీ విమర్శక అవార్డు గ్రహీత ఎం. పురుషోత్తమాచార్యులు మాట్లాడుతూ పద్య నిర్మాణ శిల్పాన్ని మధుసూదన్ నైపుణ్యంతో సాధించారని తెలిపారు. పుస్తకాన్ని సమీక్షించిన ప్రముఖ అష్టావధాని అవుసుల భాను ప్రకాశ్ మాట్లాడుతూ వస్తు వైవిధ్యంతో కూడిన ఈ ఖండకావ్యం తెలుగు సాహిత్యానికి గొప్ప చేర్పు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు తండు కృష్ణ కౌండిన్య, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, పున్న అంజయ్య, గుమిడెల్లి వెంకన్న, సుధాకర్ రెడ్డి, డి.రాములు, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, దాసోజు జ్ఞానేశ్వర్, చింతోజు మల్లికార్జునాచారి, కర్నాటి గోవర్ధన్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ శివరాంరెడ్డి



కేంద్ర బలగాల కవాతులో డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, మార్చి 29 : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కె.శివరాంరెడ్డి హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా శుక్రవారం చిట్యాలలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టింగ్‌లు పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ కె.నాగరాజు, ఎస్ఐలు సైదాబాబు, లింగయ్య, అంతిరెడ్డి, సురేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కుల సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా రవి గౌడ్



రవి గౌడ్‌కు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ యాదవ్

నల్లగొండ రూరల్, మార్చి 29 : బీసీ కుల సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఖాజీరామారం గ్రామానికి చెందిన పాలకూరి రవిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడుతూ బీసీలను సంఘటితం చేసి వారి ఐక్యతకు కృషి చేస్తానన్నారు.

### వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

చందంపేట, మార్చి 29 : వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి చందులాల్‌నాయక్ సూచించారు. చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ దెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా సరిపడా నీటిని తాగాలని, తీవ్రమైన ఎండలు ఉన్నందున తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని సూచించారు.

## నేడు పీఏపల్లి ఎంపీపీపై అవిశ్వాసం

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 29 : ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డిపై శనివారం అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల క్రితం ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని 9 మంది ఎంపీటీసీలు దేవరకొండ ఆర్డీఓకు విన్నవించారు. దాంతో అవిశ్వాసానికి తేదీ ప్రకటించగా ప్రతాప్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది. కోర్టు ఇటీవల స్టేను ఎత్తివేయడంతో ఈ నెల 30న అవిశ్వాసం పెట్టడానికి ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ సమక్షంలో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. నిబంధనల ప్రకారం సమావేశానికి 9మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉన్నది. అయితే.. ఇందులో కొందరు ఎంపీపీ ప్రతాప్‌రెడ్డికి అనుకూలంగా క్యాంపులో ఉండడంతో అవిశ్వాసం విగిపోనున్నట్లు తెలుస్తుంది.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా, మార్చి 29 : మండలంలోని అనుముల, ఈశ్వర్‌నగర్ గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 11కేవీ లిఫ్ట్ ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### నిడమనూరు సబ్ స్టేషన్ పరిధిలో..

నిడమనూరు : నిడమనూరు సబ్‌స్టేషన్ పరిధిలోని బంకాపురం, ముప్పారం, ఊట్కూరు ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 8నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున బంకాపురం, రాజన్నగూడెం, వెనిగండ్ల, నందికొండవారిగూడెం, గౌండ్లగూడెం, లక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

### మిర్యాలగూడ మండలంలో..

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్ : విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు కోసం నందిపహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అమర్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చిల్లాపురం, చిల్లాపురం తండా, శాంతినగర్, ఐలాపురం, కుంటకింది తండా, వాటర్‌ట్యాంక్ తండా, నందిపహాడ్, రవీంద్రనగర్ గ్రామాలకు ఉదయం 9నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు.

## ఆర్థికంగా నష్టపోతున్నాం.. ఆదుకోండి

- పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్




నిరసన తెలుపుతున్న పెట్రోలియం డీలర్లు

నకిరేకల్, మార్చి 29 : ఏడు సంవత్సరాలుగా కమీషన్ పెంచకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దైద రవీందర్ అన్నారు. పెట్రోలియం డీలర్లకు కమీషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ నకిరేకల్‌లోని తిప్పర్తి రోడ్డులో గల భారత్ పెట్రోలియం బంకులో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లతో పోల్చుకుంటే విద్యుత్ చార్జీలు, పెట్టుబడులు, పంపు సిబ్బందికి జీతాలు రెట్టింపయ్యాయని, కమీషన్ మాత్రం అలాగే ఉన్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి కమీషన్ పెంచాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రావు, డీలర్లు పూర్ణచందర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహులు, నరేందర్, భాస్కర్, నాగయ్య, విక్రమ్, శివ, రమేశ్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## విషతుల్యమైన నీరు తాగి గొర్రెల మృత్యువాత



బంకాపురంలో మృతి చెందిన గొర్రెలు

నిడమనూరు, మార్చి 29 : మండలంలోని బంకాపురం గ్రామంలో శుక్రవారం విషతుల్యమైన నీటిని తాగి 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బంకాపురం గ్రామానికి చెందిన రైతులు బూడిద రాములు, బూడిద కళమ్మ, బొంగరాల పెద్ద వెంకయ్యకు చెందిన 20 గొర్రెలను మేత కోసం శుక్రవారం ఉదయం గ్రామ శివారులోకి తోలుకెళ్లారు. ఈ క్రమంలో సమీపంలోని వ్యవసాయ భూమిలో గల కుంటలో నీటిని గొర్రెలు తాగాయి. తాగిన కొద్దిసేపటికే స్పృహ తప్పి పడిపోయాయి. అప్రమత్తమైన రైతులు వెంటనే పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న తుమ్మడం పశువైద్యాధికారి మేగ్యానాయక్ పరీక్షించి గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. వాటికి పంచనామా నిర్వహించి విషతుల్యమైన నీటిని తాగడం వల్లే మృతి చెందాయని చెప్పారు. పరీక్షల నిమిత్తం వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

## సైబర్ మోసం.. రూ.7లక్షలు మాయం

దేవరకొండ రూరల్, మార్చి 29 : సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ సరికొత్త పంథాను ఎంచుకొని సామాన్య ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో మండలంలోని ముదిగొండ గ్రామానికి చెందిన మారుపాకుల బాలయ్య బ్యాంకు ఖాతా నుంచి రూ.7లక్షలు కొట్టేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య ముదిగొండలో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్నాడు. ఉపాధ్యాయుల వేతనాల కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముదిగొండ బ్రాంచిలోని తన అకౌంట్‌లో రూ.7లక్షలు జమ చేశాడు. గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి నీకు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఖాతా ఉందా? అని రెండు సార్లు బాలయ్యతో సంభాషించాడు. అనంతరం 15 నిమిషాలకే తన ఖాతా నుంచి రూ.7లక్షలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఖంగుతున్న బాలయ్య వెంటనే బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించగా.. ఇది సైబర్ నేరగాళ్ల పని అని చెప్పాడు. ఆ వెంటనే సైబర్ క్రైమ్ కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై సీఐ నర్సింహులు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త విధానాలతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనుకోకుండా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు పోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే సంబంధిత అకౌంట్లను ఫ్రీజ్ చేస్తారని చెప్పారు. అనవసర యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, అనవసర లింకులను ఓపెన్ చేయవద్దని ప్రజలకు సూచించారు.